128

# "తీర్పు"

. JOSEPH'S GIRLS HIGH SCHOOL,
GUNTUR.

చుట్టూరా పెద్దమనుష్యులూ, కుతూహలంగా చూస్తున్న కుర్రకారు, యువకులు, వలయాకారంలో కూర్చుని, నిల్చుని ఉన్నారు. పులులమధ్య చిక్కు బడిపోయిన మేక పిల్లలా తలవంచుకొని నిల్చుని ఉంది రమణమ్మ. తన శరీరాన్ని చీల్చి చెండాడుతున్న వెకిలి చూపులూ, వెర్రి చూపులూ, కోరచూపులూ, ఆమెను మరింతగా క్రుంగదీస్తున్నాయి. వాగ్బాణాలు, వికవికలు, పకపకలూ, నిప్పురవ్వల్లా చిందిపడుతూంటే, ముతక చీరకొంగు మరింత దగ్గరగా లాక్కుని నిల్చుంది !

"ఏం రమణమ్మా ! ఝాము పొద్దెక్కింది. ఇళ్ళదగ్గర ఆడోళ్ళు కనిపెట్టుకుంటారు. ఏదో తేల్చి చెప్పెయ్. " ప్రెసిడెంట్ శేషాద్రి హుంకరింపుతో, గుంపులో గుసగుసలు తగ్గి, అన్నిజతల కళ్ళూ, చెవులూ, రమణమ్మమీదే కేంద్రీకరింపబడ్డాయి.

రమణమ్మ నోరు విప్పలేదు....కానీ ఆమె మనస్సు భగ భగ మండిపోతోంది.

ఒక్క ఆడదాన్ని....ఒక్క ఆడగాన్ని అవమానపరచడానికే, ఆమె జీవితం సర్వనాశనం చేయడానికే ఇంతమంది మగధీరులు ఇంతగా పట్టుపట్టాలా ? ఇంతటి యుద్ధం ప్రకటించాలా ? ఇందులో ఏ ఒక్కరికి తను ఏమపకారం చేసింది?

ఇంతకూ తను చేసిన నేరంఏమిటి ? ఆమె చెవులలో హోరు మొదలైంది. చుట్టూ రా జనం ఉన్న సంగతి ఆమె పూర్తిగా విస్మరించింది. భగ భగ మండుతున్న ఆమె హృదయం....గత స్మృతుల పేటిక తెరచి, గతసంఘటనల మీదకు అంతర్దృష్టిని సారించింది.

రమణమ్మ భర్త రాఘవులు, సంపాదనమీద ఆశతో సైన్యంలో చేరి అస్సాముదగ్గర ఉన్నాడు.

రాఘవులు రమణమ్మ, పూవు తావిలా, ఒకరి కొకరుగా ఉండేవారు. కాని ముగురు పిల్లల్ని పోషించడం కష్టమైపోయింది రాఘవులుకు. అందుకే సంపాదన ఎక్కువ వస్తుందన్న ఆశతో సైన్యంలో పనికి కుదిరాడు.

రమణమ్మ నిప్పులాంటి మనిషి, కాయకష్టం చేస్తుంది. ఉన్నంతలో ఏ లోటూ లేకుండా పిల్లల్ని పెంచుకొంటోంది. నెలనెలా రాఘవులు పాతికో ముప్ఫైయో పంపిస్తాడు, గుట్టుగా తన బ్రతుకు తను వెళ్ళమార్చు కొంటోంది. సంవత్సరానికి ఒక్కసారి రెండు నెలల సెలవిస్తారు రాఘవులుకు. ఆ రెండు నెలలూ రమణమ్మకు పండుగ. సంతోషంగా తన కుటుంబంతో గడిపి, మళ్ళీ వెళ్ళిపోతాడు రాఘవులు. ఇది రెండేళ్లుగా జరుగుతోంది.

నల్లగా ఆరోగ్యంగా ఉండే రమణమ్మ అందంగా ఉంటుంది. ముగ్గురు పిల్లల తల్లి అని కొత్తవారెవరూ అనుకోలేరు, అందుకనే ప్రెసిడెంటు శేషాద్రి ముచ్చటపడి, చివాట్లు తిన్నాడు రమణమ్మచేత. వైస్‌ప్రెసిడెంటు ఎల్లమంద

గుంభనగా వ్యవహారం నడుపుదామని ఎన్నోరకాలుగా చూశాడు. పసిగట్టిన రమణమ్మ పనిమాలా ఎల్లమంద ఇంటికి వెళ్ళి ఎల్లమంద భార్య నరసమ్మతో ముచ్చట్లాడింది. "చూశావా వదినమ్మా! పాపిష్టిలోకం! ఎల్లమందన్న అడపా తడపా నాకు ఏదేనా మాట సాయం చేస్తున్నాడని, ఎట్లంటే అట్లా నిందలు వేస్తున్నది! ఎందుకొచ్చిన బెడద? నా మూలంగా అన్న మాటపడటం నాకు బాగాలేదు. నే చెబితే ఏమనుకొంటాడో ఏమో! నువ్వే చెప్పు అన్నతో, నా అగచాట్లేవో నే పడతా" అంది మెల్లగా. అసలు సంగతి గ్రహించుకొన్న ఎల్లమంద పళ్ళునూరు కొన్నాడు లోలోపల. చేసేది లేక కోపం దిగమింగుకొన్నాడు.

శలవులకు ఇంటికి వచ్చిన రాఘవులుతో అన్ని సంగతులూ చూచాయగా చెప్పింది రమణమ్మ.

"నేనూ, పిల్లలూ నీదగ్గరే వుంటాం! చేతనైన పని నేనూ చేస్తాను" అంది నిట్టూరుస్తూ!

రాఘవులు క్షణకాలం మాటాడ లేదు. తర్వాత మెల్లిగా పెదవి విప్పాడు, "నీలాటి ఆడవాళ్లు అలాటిచోట వుండకూడదే."

"అంటే" ఆశ్చర్యంగా అడిగింది రమణమ్మ. అక్కడంతా సైనికులు. వాళ్ళకెలాటి అడ్డంకులూ వుండవు. మద్యమాంసాలు, సారాయి, వేటికి కొదవుండదు. అలాటి చోట్ల...." ఇక చెప్పలేనట్లు అనేశాడు రాఘవులు.

రమణమ్మకు అర్థమయింది. అలాటి ప్రదేశాలలో, తన రక్షణ తనకూ, రాఘవులుకూ కూడ అసాధ్యమైపోతుంది. అనవసరంగా రాఘవులుకు తనో సమస్యగా పరిణమిస్తుంది.

"ఇది వూరుగదే రమణా ? ఇక్కడ మనుషులేకదా వున్నారు. నీకేదైనా కష్టమొస్తే వాళ్ళు....న్యాయం చెప్పరూ! నేను పంతులుగారితో చెప్పి పోతాన్లే.... నిన్ను కాస్త కనిపెట్టి వుండమని....ఏం? అట్లా దిగులుగా చూస్తే నా కాళ్ళు ముందుకు సాగవు. నాలుగు డబ్బులు సంపాదించకుంటే, పిల్లల్ని బాగా పెంచుకోలేం ! ఏమంటావ్ ?

రమణమ్మేమంటుంది ! తల్లిగా, తన బిడ్డల భవిష్యత్తును మంచిగా కోరుకోని స్త్రీ ఉంటుందా ?

రాఘవులు వెళ్ళేముందు, వూరిలో అనుభవంలోను, విద్యలోనూ మంచితనంలోను పెద్దవాడైన పంతులుగారి దగ్గరకు వెళ్ళాడు. రమణమ్మ సందేహాలు, భయాలు చెప్పి కాస్త కనిపెట్టి ఉండమని కోరి మరీ వెళ్లాడు.

పంతులుగారు సజ్జనుడు, భర్త దూరదేశంలో ఉన్నా, అనవసరపు ప్రస్తావనల జోలికి పోకుండా. తన పనేదో, తానేదోగా ప్రవర్తించే రమణమ్మంటే ఆయనగారికెంతో వాత్సల్యం.

మూడు రోజుల క్రితం....పగలంతా వరిమాగాణీలో కలుపుకు వెళ్లొచ్చి, రాత్రి చంటిపిల్లాడికి అన్నంపెట్టి నిద్రపుచ్చి, తానూ పడుకుంది రమణమ్మ. అంతక్రితం రోజే, పెద్దపిల్ల

లిద్దర్నీ తన తమ్ముడొచ్చి పిలుచ్చుకెళ్లాడు. నాల్గురోజులుంచుకొని పంపిస్తామని.... మంచి నిద్ర పట్టింది.

త్రుళ్ళిపడి లేచింది రమణమ్మ. బుడ్డిదీపం వెలుగుతూనే వుంది గుడిసెలో! గుడిసె తలుపు మెల్లిగా తడుతున్న శబ్దం! ఆశ్చర్యమూ, భయమూ క్షణకాలం కమ్ముకున్నాయి. "ఎవరూ" అంది గుండె దిటవు చేసికొని.

"తలుపు తియ్యి రవణమ్మా! నేనూ...." అవతల మగ గొంతుకు చాలా తగ్గుస్థాయిలో వినిపించింది.

"ఎవరు ?" ఈసారి కాస్త పెద్దగా అరిచింది. "రాజయ్యను".

ఎల్లమందకొడుకు రాజయ్య.... బస్తీలో చదువుకొంటు న్నాడు. నెమ్మదైనవాడు. తనకంటె పదేళ్లు చిన్నవాడు. పరాయిస్త్రీలను ఇటు చూస్తే, అటు తలవంచుకు వెడతాడు. మంచివాడు.

పాపం ఈ వేళప్పుడు ఎందుకొచ్చాడో!

గబుక్కున తలుపుతీసి బయటకు వచ్చింది రవణమ్మ. గుడిశె వారగా చీకటినీడలో నిల్చునివున్నాడు రాజయ్య.

"ఏం రాజయ్యా! ఇట్లా వచ్చావేం?" ఆమె ప్రశ్న పెదవులు దాటకముందే, రాజయ్య చేతిలోని పదిరూపాయల నోటు గాలిలో వూగింది. నోట మాట రాక నిల్చుండి పోయింది క్షణకాలం.

"ఇట్లారా ! ఒకమాట !" చీకటిలో నీడ రహస్యంగా పిలిచింది. రమణమ్మ నిర్ఘాంతపోయింది, నిండా ఇరవైఏళ్లు లేని కుర్రాడు, తన తమ్ముడిలాటివాడు; ముగ్గురు పిల్లలతల్లి తను, ఒక భర్తకు భార్య అన్నమాట మర్చిపోయాడా ?

"ఇట్లారా ?" మళ్ళీ అదే స్వరం !

ఒక్కసారిగా ఆమెలో ఆత్మాభిమానం బుసలుకొట్టింది,

"ఎందుకయ్యా ! ఈవేళప్పుడేం రహస్యాలు ? ఫో ఇంటికి ఫో.... తెల్లారేక వచ్చి చెబుదువుగాని." జుగుప్సతో శరీరం కంపించి పోతుంటే, కటువుగా అంది.

హఠాత్తుగా అతగాడొచ్చి చెయ్యిపట్టుకొని నోరు నొక్కేస్తాడని వూహించలేక పోయింది. క్షణకాలం పెనుగులాడింది. బలిష్టమైన శరీరంతోపాటు, ఆత్మవిశ్వాసం తోడై, ఆమెకు ఎక్కడ లేని బలం వచ్చింది. ఒక్కవూపుతో అతగాణ్ని విదిలించి కొట్టింది.

"పోరా ! చవటా ! నాలాటి ఇద్దరక్కలున్నారు నీకు. కళ్ళు నెత్తికెక్కాయి. మీ అమ్మ మొహం చూచి వదలేస్తున్నాను. లేకుంటే నీ నెత్తురు తాగేదాన్ని...."

చీకటిలో నీడ మాయమైంది. కాని చుట్టూరా పది మందీ పోగయ్యారు.

"ఏమిటి రవణమ్మా ! ఏమయ్యింది ? ఎవరొచ్చారు? దొంగలా ?" ఎన్నో ప్రశ్నలు చెలరేగాయి.

"ఎవరో పోకిరీ వెధవ....వాడికి నాలాంటి అక్కలు లేరనుకున్నాడేమో ?" అసలు మనిషి పేరు చెప్పకుండ రోషంతో, ఆవేశంలో వూగిపోయింది రవణమ్మ.

ఎంత ప్రయత్నించినా ఆ మనిషెవరో తెలుసుకోలేక పోయూరెవరూ ! అదే ఆమె చేసిన పొరపాటు.

తెల్లగా తెల్లారింది. వూరు వూరంతా గుప్పుమంది నిప్పులా !

"రహస్యంగా రమ్మని రాజయ్యకు కబురంపినదట రవణమ్మ, రాజయ్య అలాంటి పోకిరీకుర్రాడు కానందువల్ల, అతగాడు వెళ్ళలేదట. రాజయ్యకోసం ఎదురుచూస్తున్న రవణమ్మ మరెవడో రావటం చూచి, సమయానికి నలుగురూ లేవడంవల్ల, రభసచేసిందట. తన పాతివ్రత్యం చాటిచెప్పుకోవటానికి అలా నాటకం ఆడిందట."

వేడివేడిగా సాగుతున్న గుసగుసలు విని నిర్ఘాంత పోయింది రవణమ్మ.

జాలరెడ్డి విలాసంగా మీసం మెలితిప్పి కుర్రకారును కూడదీసికొని మరీ చెబుతున్నాడు. "చాల్లెండర్రా ! అదో పెద్దవింతగా చెబుతున్నారు. మొన్నరాత్రి తెల్లవార్లూ, నేనుకాదూ దాంతో కబుర్లాడుతూ కూర్చుంది ? పిల్లల పీడెందుకూ, పుట్టింటికి తోలెయ్యమని నేనే చెప్పాను— పంపేసింది."

రవణమ్మ కుప్పలాగా కూలబడి పోయింది. ఛాతీ విరుచు కొని అలా చెబుతున్న జాలిరెడ్డికి తనేం అపకారం చేసింది? మర్యాదగా "అన్నా" అదేంగానీ తలబిరుసుగా "దున్నా" అనలేదే ఏనాడూ!

శేషాద్రి పెద్ద లెక్చరు దంచేశాడు. "దాని సంగతి ఈ రోజు తెలుసుకొన్నారు మీరు! నాకేనాడో తెలుసు."

శ్రోతలలో కుతూహలం గమనించి మరింతగా రెచ్చి పోయాడు. నిమ్మతోటకు నీరెట్టిస్తున్నా నోసారి! చీకటి పడింది. పాలేరును ఇంటికి పంపి మడవ నేనే బిగిస్తున్నా!

"శేషన్నా! గుడిశె పడేలాఉంది, ఓ యాభై ఉంటే ఇవ్వు—తీరుస్తాలే!" అంది వెనకగా వచ్చి నిల్చుని. మీరు నమ్మండి, మానండి. దానికీ నాకూ బెత్తెడు దూరం లేదు. ఆసి దీని సాహసం కూలా! అనుకున్నాను—అయినా కథ ఏమిటో చూద్దామని "ఎట్లా తీరుస్తావే రవణా? అన్నాను.

"నే లేనా" అంది సిగ్గుమాలింది.

"అన్నా! అంటూ ఆపిలుపేమిటో, ఆ వ్యవహార మేమిటో చూడండి! నీకిది తరహా కాదని చివాట్లేసి పంపించాను."

రమణమ్మకు దిక్కు తోచలేదు. వీళ్లు మనుషులేనా? అబద్ధాలు ఇంత బాహాటంగా, ఇంతగా రంగులు పులిమి.... ఇంతా చేసి ఒక ఆడదాన్ని నాశనం చేయడానికా.... చెబు తున్నారు?

"పసిరిక పాముంటి నా బిడ్డ గాబట్టి సరిపోయింది. మరొక కుర్రవెధవైతే దీని మాయలో పడిపోయేవాడే కదూ ! దీని అంతు తేలుస్తాను. ఇది ఆడది కాదు. కామినీ పిశాచి" ఎల్లమంద చిందులుతొక్కాడు.

రవణమ్మ నేదో మత్తులా ఆవహించింది, తన చుట్టూగా విషవాయువులు. అవి తనని క్రమ్మివేస్తున్నాయి. ఈ దుమారమంతా రాఘవులుకి తెలిస్తే ?

తెలిసినా ఫర్వాలేదు. తనని అనుమానించేంత మూర్ఖుడు కాడు అతడు. కానీ, పులుల్లాంటి ఈ మనుషులు మాటలతో, చేతలతో చేసే అవమానాలకు తట్టుకోగలడా ?

తడబడే అడుగులతో పంతులుగారింటివేపు పరుగు తీసింది రమణమ్మ—కాళ్ళకు చుట్టుకుంది—పంతులుగారికి వయసు ముదిరినా, మనసూ, మానవత చావలేదు.

"నాకు తెలుసమ్మా ! నిజమేమిటో నాకు తెలుసు. రాఘవులుకు నేను చెప్పగలను—పో—ఇంటికి వెళ్ళు." వాత్సల్యంగా తల నిమిరాడు. కొండంత బలం వచ్చింది రవణమ్మకు.

"మీరొక్కరూ నమ్మితేచాలు బాబుగారూ!" అంది ఆనందం దుఃఖం మిళితమైన గొంతుకతో ! ఆమె వెళ్ళటానికి వెనుదిరిగింది—ఎల్లమంద పంతులుగారికోసం ఇంట్లోకి అడుగెట్టాడు. ఆమె గబగబా వెళ్ళిపోయింది.

"ఇదెప్పట్నుంచి పంతులుగారూ ? ఏదో మీరు పెద్దనా రనీ, మంచివారనీ, ...." ఎల్లమంద వక్రంగా చూస్తూ విసురు తున్న వ్యంగ్యోక్తి, మధ్యలోనే త్రుంచేశారు పంతులుగారు,

"ఎల్లమందా ! మాటకైనా మనిషికైనా శుద్ధి, శుచి వుండాలయ్యా."

"సర్లెండి ! మీ గొడవలు నా కెందుకు ? రేప్పొద్దున నలుగుర్నీ కూడేస్తున్నాడు శేషాద్రి....మీరూ రావాలి."

"ఎందుకూ ? "

ఎందు కేవిటి ? అభంశుభం తెలియని నా పిల్లాణ్ణి అల్లరి పట్టించింది— దాని అంతు తేల్చొద్దూ ?

"అయిందేదో అయింది. ఇంకా అల్లరెందుకూ" నిర సనగా అరిచారు పంతులుగారు,

ఎల్లమంద నవ్వాడు "అట్లా ఊరుకొంటే ఎట్లా పంతులుగారూ ? రేప్పొద్దున నా మీదో, మీమీదో అభాండం వేస్తుంది. ఆ నాడు ? అదేం కుదరదు ! అది పది మందిలో తన తప్పు ఒప్పుకొంటే చాలు. అదే దానికి శిక్ష. మీరు రావాలి—తీర్పు చెప్పాలి.

"నేనా—"

"ఆ—మీరే ! సభలో కూర్చున్నాక, మొగ మాటాలు చూచుకోకండి పంతులుగారూ ! ఇంతవరకూ న్యాయస్థులని మంచిపేరు తెచ్చుకున్నారు—ఒక—ఆడదాని

మూలంగా, దాన్ని చెడగొట్టుకోకండి. న్యాయమే చెప్పి శభాష్ అనిపించుకోండి—మరి వస్తా....!"

ఎల్లమంద వెళ్ళిపోయాడు! గోడవారగా నిల్చుని అంతా విని రవణమ్మ నిర్వికారిలా నిల్చుండిపోయింది.

* * *

"ఏం పంతులూ! మీరైనా చెప్పండి తీర్పు! అదేమో మూగనోము పట్టిందామె!"

ఖంగుమన్న శేషాద్రి గొంతుకతో త్రుళ్ళిపడింది రవణమ్మ! గత ఐదారు నిముషాలుగా తను చూస్తుండిన దృశ్యాలన్నీ కరిగిపోయాయి.

పంతులుగారు మాట్లాడలేదు. ఆయనగారి మనస్సు గిలగిలలాడిపోతోంది! తను తీర్పు చెప్పాలి! ఏమని? రవణమ్మ చెడ్డమనిషని! రాజయ్య పెద్దమనిషని! ఏది న్యాయం? తన తీర్పు ఎలా ఉండాలి?

ఫాషన్ పేరుతో నైట్‌క్లబ్స్‌లో తాగి తందనాలాడుతున్న వేలాది స్త్రీలకు శిక్ష ఏమి వేయబడుతోంది? తమ కామతృష్ణ తీర్చుకోవటానికి ఎందరో నీచ స్త్రీలుండగా, రవణమ్మ లాటి ఇల్లాళ్ళ బ్రతుకులు అపవాదులు పాలుచేస్తున్న వేలాది రాజయ్యలకు ఏచట్టం శిక్షలు వేస్తోంది?

తమ మగసిరి చాటుకోవటం కోసం, అన్నెంపున్నెం ఎరుగని పరాయి ఇల్లాలిని, తాము అనుభవించినట్లు కోతలు

కోసే జాలిరెడ్డి లాటివారి కేతీర్పులూ అవసరం లేదా? రవణమ్మ చేసిన నేరమేమిటి? ఆత్మాభిమానంతో బ్రతకటమా? భర్తకు దూరంగా ఉండటమా? రాజయ్యలాటి పయోముఖవిషకుంభాన్ని బయట పెట్టక పోవటమా? పై వాటిలో ఏది ఆమె చేసిన తప్పు? అందుకుగాను తను ఏవిధంగా తీర్పు చెప్పాలిపుడు?

"పంతులుగారూ! మొహమాట పడుతున్నారా?" ఎల్లమంద వక్రంగా నవ్వాడు. క్షణం జనంలో గుసగుసలు తారాస్థాయి నందుకున్నాయి.

"ఏదో కథ వుండి వుంటుంది. గొంతుక పట్టుకోంటోంది పాపం ముసలాడికి." ఎవరో సన్నగా అన్నమాట పెద్దగానే వినిపించింది. పంతులుగారి శరీరం జలదరించింది.

అప్రయత్నంగా రవణమ్మ వేపు చూశారు. వధ్యశిల ముందు నిల్చున్న బలిపశువు గుర్తుకు వచ్చిందాయనకు. అదే సమయంలో రవణమ్మకూడ తలెత్తి ఆయనగారి వేపు చూచింది. ఇరువురి కళ్లూ కలుసుకొన్నాయి. ఆమె ఆర్ద్రమైన ఆచూపుల్లో శతకోటిభావాలు చదవగలిగారాయన!

"బాబుగారూ! బాధపడకండి. స్త్రీ,స్త్రీగా బ్రతుకుతూంటే చూచి ఓర్వగలిగే, గౌరవించగలిగే సమాజం ఇంకా పుట్టలేదు బాబుగారూ! అది ఎప్పుడు పుడుతుందో మనకు తెలియదు కూడా" అన్నట్లున్నాయి ఆమె చూపులు.

మరుక్షణంలో ఆమె పెదవులు విడివడ్డాయి....

"పంతులుగారిని ఏమీ అనకండి, వారు నాకు తండ్రి లాంటివారు....నిజం నేను చెబుతాను....ఇక దాచినా లాభంలేదు."

స్పష్టంగా ఖంగుమంటున్న రమణమ్మ గొంతుకతో, ఎవరికివారు కుతూహలంగాచూస్తుండిపోయారు.

"అవును రాజయ్యను రమ్మన్నది నేనే, మరెవరో వచ్చారు. పదిరోజుల క్రితం శేషాద్రిగారితో నిమ్మతోటలో సరసాలాడింది నేనే. మొన్న రాత్రంతా నాతోనే వున్నాడు జాలిరెడ్డి. వారంరోజుల క్రితం ఎల్లమంద..ారు నాకో వంద రూపాయలు ఇచ్చారు. అందాకా ఎందుకు? ఇక్కడ కూర్చున్న వారంతా, చిన్నా-పెద్దా, అందరూ నాతో కొద్దో-గొప్పో పరిచయం వున్నవారే! మీలాంటి పెద్ద మనుష్యుల మధ్య నాలాటి చెడిపోయిన ఆడది ఉండటం మంచిదికాదు. అంచేత నేనూ, నా పిల్లలూ వెళ్ళిపోతాం. ఎక్కడికో తెలుసా. అస్సాము దగ్గరకు....అక్కడ ఇంత కంటె ఎక్కువ బాధలు పడతాననే భయం నాకిప్పుడు పోయింది....

రమణమ్మ చరచరా వెళ్ళిపోయింది.

పంతులుగారు అందరివేపూ కలయచూచారు. చాలా మందిలో ఏదో భయం. చాలా కొద్దిమందిలో విజయగర్వం కనిపించింది. ఆయనగారికి వెర్రినవ్వు ఎగసిఎగసి వస్తోంది.

ఒక మంచి స్త్రీని—చెడుగా నిరూపించడానికి, ఇంత మంది పెద్దలూ, ఇన్నిరకాల ఆయుధాలూ కావాలా? ఒక అబద్ధాన్ని నిజం చేయడానికి, ఒక నిజాన్ని అబద్ధంగా నిరూపించడానికి, ఇంత ప్రయత్నమా? దీనికంతకూ కారణం—?

రమణమ్మ ఓ పేద ఇల్లాలు !

ఆమెకు ఘరానాగా తప్పుచేసి మెప్పు పొందేంత ఆర్థిక బలంలేదు !

తన తప్పుల్ని కూడా ఎదుటివారిమీద రుద్దేంత పలుకుబడి, పదవిబలం లేదు !

నిజం ! అంతే !

("సూర్యచక్రమ్" జనవరి 70)